ధరణి దరఖాస్తులు పరిష్కరించండి


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో 3వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని.. జూన్ 30వరకు ఉన్నవి.. వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇనాం భూముల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. దరఖాస్తులు తిరస్కరిస్తే స్పష్టమైన కారణాలు తెలపాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

కేసీఆర్ గారూ.. నర్సాపూర్‌లో పర్యటించండి


మాజీ సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే సునీతారెడ్డి, నేతలు

నర్సాపూర్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మంగళవారం కలిశారు. మొక్క అందజేసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. నర్సాపూర్ నియోజకవర్గ పర్యటనకు రావాలని కేసీఆర్‌ను కోరగా.. వీలైనంత త్వరలో సమయం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నేతలు చంద్రాగౌడ్, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులున్నారు. అంతకుముందు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను వారు కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

శివ్వంపేట: మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, పురపాలిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పబ్బ మహేష్ గుప్తా తదితరులు కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. రమణగౌడ్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

269 మందికి పోస్టింగులు

నేడు విధుల్లో చేరనున్న కొత్త ఉపాధ్యాయులు


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో రాధాకిషన్

మెదక్, న్యూస్‌టుడే: జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పూర్తయింది. ఇటీవల డీఎస్సీ-2024లో 1:3 నిష్పత్తి ప్రకారం 384 మంది అభ్యర్థులను ఆహ్వానించారు. వారి ధ్రువపత్రాలు పరిశీలించాక అర్హుల్ని ఎంపిక చేశారు. ఈనెల 7న హైదరాబాద్‌లో వారికి నియామక పత్రాలు అందజేసిన సంగతి విదితమే. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయించారు. ఉదయం అభ్యర్థులను ఆహ్వానించగా.. కౌన్సెలింగ్ ప్రక్రియను వాయిదా వేసినట్లు విద్యాశాఖ నుంచి సందేశం రావడంతో అభ్యర్థులు కొంత ఆందోళనకు గురయ్యారు. అనంతరం మధ్యాహ్నం కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టారు. 272 పోస్టులకు గాను 269 అభ్యర్థులకు పోస్టింగ్ కేటాయించారు. మరో మూడు పోస్టింగ్‌లను అనివార్య కారణాల వల్ల పక్కన పెట్టినట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. పోస్టింగ్ పొందిన అభ్యర్థులు బుధవారం విధుల్లో చేరాల్సి ఉంటుంది. జిల్లా సెక్టోరియల్ అధికారి సుదర్శన మూర్తి, మెదక్ ఎంఈవో నీలకంఠం పాల్గొన్నారు.

కోర్టు భవనం పరిశీలన


భవనం వద్ద సబ్ జడ్జి జితేందర్ తదితరులు

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: మండల కేంద్రం అల్లాదుర్గంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేయనున్న జూనియర్ సివిల్ జడ్జి, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు భవనాన్ని మెదక్ జిల్లా సబ్ జడ్జి జితేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 19న కోర్టును ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్ చంద్రగౌడ్, కార్యదర్శి దుర్గారెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతకు అదనం

- పంటలకు మద్దతు ధర పెంపు



న్యూస్‌టుడే, మెదక్: ప్రైవేటు విపణిలో పంటల ధరలు క్షీణిస్తున్న వేళ సర్కారు ప్రకటించిన మద్దతు ధరలు రైతులకు దన్నుగా నిలుస్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా రైతులు పండించే వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను దళారుల బెడద లేకుండా సర్కారు చర్యలు చేపట్టింది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తూ అన్నదాతలు లాభాలు పొందుతున్నారు.

మొక్కజొన్నకు భరోసా...



మొక్కజొన్నలు మద్దతు ధర దాటి రూ.2,500 వరకు అమ్ముడుపోతున్నాయి. ఈసారి జిల్లాలో 1,578 ఎకరాల్లో పంట సాగు చేశారు. ఎకరాకు 20 క్వింటాళ్ల మేర దిగుబడి రానుంది. ప్రభుత్వం క్వింటాలుకు ప్రస్తుతం రూ.2,225 ప్రకటించింది. ఇది గతం కంటే రూ.135 ఎక్కువ. దిగుబడి తక్కువగా ఉండటంతో ధర ఎక్కువగా ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఒకవేళ ప్రైవేటు విపణిలో ధర తక్కువగా ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దన్నుగా నిలువనుంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పోల్చితే రైతులు సర్కారు కేంద్రాల్లో విక్రయిస్తే రూ.42.60లక్షలు అదనంగా అందనుంది. అయితే ప్రస్తుతం ప్రైవేటు విపణిలో ధర ఎక్కువగా ఉండటంతో రైతులు అటువైపే వెళుతున్నారు.

పంటలకు మద్దతు ధరలు ఇలా..(క్వింటా)

పంట	2023-24	2024-25	పెంపు
వరి (సాధారణం)	2,183	2,300	117
వరి (ఎ గ్రేడు)	2,203	2,320	117
మొక్కజొన్న	2,090	2,225	135
పత్తి (మధ్యరకం)	6,620	7,121	501
పత్తి (పొడవురకం)	7,020	7,521	501

పత్తి క్వింటాలుకు రూ.501...



జిల్లాలో 36,155 ఎకరాల్లో పత్తి సాగైంది. దాదాపు 2,89,240 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడిప్పుడే పత్తి విపణికి రావడం మొదలైంది. మరో వారం రోజుల్లో పుంజుకోనుంది. అప్పటిలోపు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే ధర నిలకడగా ఉంటుందని.. లేకుంటే ప్రైవేటు వ్యాపారుల మాయాజాలానికి తీవ్రంగా నష్టపోతామని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్‌లో ధర పెరిగే అవకాశం లేనందున.. ప్రభుత్వం పెంచిన మద్దతు ధర రైతులను ఆదుకోనుంది. జిల్లాలో సీసీఐ కేంద్రాలు లేనందున సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో విక్రయించాలి. ప్రభుత్వం గతంలో కంటే క్వింటాలుకు రూ.501 పెంచడంతో మద్దతు ధర రూ.7,521కి చేరింది. దీంతో రైతులు సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయిస్తే ఈసారి రూ.14.49 కోట్ల అదనంగా చేతికందనుంది.

సన్నాలకు బోనస్



జిల్లాలో ఈ సీజన్లో రైతులు మొత్తం 2,97,339 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 1,04,974 ఎకరాల్లో సన్నరకం వేశారు. వరికి మద్దతు ధర పెంచిన సర్కారు. సన్నాలకు అదనంగా క్వింటాలుకు రూ.500 చెల్లిస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో సర్కారు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని భావిస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 2,30,964 టన్నుల సన్న ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన రైతులకు రూ.115.48 కోట్లు అదనంగా బోనస్ రూపంలో చేతికందనుంది. క్వింటాలుకు పెంచిన మద్దతు రూ.117 కారణంగా జిల్లా రైతులకు గతేడాదికంటే ఈసారి రూ.80.13 కోట్లు అదనంగా లబ్ధి చేకూరనుంది.

ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉపాధ్యాయులే


శిరీష, మానస, ఉషశ్రీ

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉపాధ్యాయులైన పలువురికి ఆదర్శంగా నిలిచారు. అల్లాదుర్గం గ్రామానికి చెందిన సదానందం, రాజేశ్వరి దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. సదానందం దర్జీ పని చేస్తూ కుమార్తెలను చదివించారు. తల్లిదండ్రుల ఇబ్బందులను చూసి ఉన్నత స్థానంలో నిలవాలనే తపనతో వారు కష్టపడి చదివారు. 2012లో రెండో కుమార్తె మానస, 2018లో మూడో కుమార్తె ఉషశ్రీ, ప్రస్తుత డీఎస్సీలో పెద్ద కుమార్తె శిరీష ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. దీంతో గ్రామస్థులు వారిని అభినందించారు.

రోగులకు ఇబ్బందులు రావొద్దు

రామాయంపేట, న్యూస్‌టుడే: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని డీసీహెచ్‌వో శివదయాళ్ సూచించారు. మంగళవారం రామాయంపేట సామాజిక ఆసుపత్రిని ఆయన సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య పరీక్షలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ లింబాద్రి, సిబ్బంది ఉన్నారు.

విచారణకు హాజరుకాని రెడ్డిపల్లి రైతులు


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, న్యూస్‌టుడే: ప్రాంతీయ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో నర్సాపూర్‌లోని రైతు వేదికలో ఆర్డీవో విచారణ సమావేశాలు మంగళవారం నిర్వహించారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామ రైతులతో ఉదయం సమావేశం నిర్వహించగా.. ఒకరిద్దరు మాత్రమే హాజరయ్యారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు వేచిచూసినా వారు రాలేదు. మధ్యాహ్నం తర్వాత శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు భారీగా తరలివచ్చారు. వారి అభ్యంతరాలు అందజేశారు.

పాడయ్యాయని.. పక్కన పడేసి..



నర్సాపూర్ పురపాలికలో రెండు స్వచ్ఛ ఆటోలు మూలనపడ్డాయి. వాటికి నెలల తరబడి మరమ్మతులు చేయించకుండా వృథాగా ఉంచుతున్నారు. పురపాలికలో మొత్తం 15వార్డులుండగా 8 ఆటోలు మాత్రమే చెత్త సేకరిస్తున్నాయి. ఇంకా ఏడు వరకూ అవసరం ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న 8 ఆటోల్లో రెండు మరమ్మతులకు గురవ్వడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. -న్యూస్‌టుడే, నర్సాపూర్

కాళేశ్వరం కాల్వకు జలకళ..



ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నిర్మాణంలో ఉన్న కాల్వలు సైతం నీటితో కళకళలాడుతున్నాయి. నర్సాపూర్ మండలంలోని మంతూరు, రెడ్డిపల్లి గ్రామ సమీపం మీదుగా కాళేశ్వరం కాలువ నిర్మాణం పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కాల్వ, సొరంగం నీటితో నిండిపోయింది. దీంతో సమీపంలోని బోరుబావుల్లో నీటిమట్టం బాగా పెరిగినట్లు రైతులు తెలిపారు. -న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్

విశాల గదులు.. విస్తృత సేవలు

త్వరలో అందుబాటులోకి 50 పడకల ఆసుపత్రి


సామాజిక ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం నిర్మాణం

న్యూస్‌టుడే, కౌడిపల్లి: ఉమ్మడి కౌడిపల్లి మండలానికి ఏళ్ల నుంచి ఒకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. రెండు మండలాలుగా చిలప్‌చెడ్, కౌడిపల్లిగా విడిపోయినా పీహెచ్‌సీ ఒక్కటే సేవలందిస్తోంది. గత భారాస ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న మదన్‌రెడ్డి తన సొంత గ్రామమైన కౌడిపల్లికి 50 పడకలతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించారు. ఆరు పడకలతో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విస్తరించారు. భవన సముదాయానికి జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం)నిధుల కింద రూ.9.61కోట్లను మంజూరు చేయించారు. 2022 అక్టోబర్ 2న భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తొలగించి అక్కడే నూతన సామాజిక ఆరోగ్య కేంద్రానికి భవనాలను నిర్మిస్తున్నారు.

అత్యవసరంలో ఉపయోగం

రెండేళ్ల క్రితం నిర్మాణ పనులు మొదలు కావడంతో ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. జీప్లస్ వన్‌గా నిర్మిస్తున్నారు. సాధారణ వైద్యసేవలు, ఓపీ, ఐపీ, స్పెషలిస్ట్ సేవలకు విశాలమైన గదులతో 45వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. త్వరలోనే నిర్మాణం పూర్తిచేసి సేవలందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఆసుపత్రి స్థాయి పెరగడంతో ఉమ్మడి మండల ప్రజలతో పాటు జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే బాధితులకు సత్వర సేవలు అందనున్నాయి.

మరో మూడు నెలల్లో పూర్తి

రవీందర్‌రెడ్డి, ఈఈ, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ

సామాజిక ఆరోగ్య కేంద్రం భవన సముదాయ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. మూడు నెలల్లో పూర్తిచేసేలా గుత్తేదారుపై ఒత్తిడి తెస్తున్నాం. భవన సముదాయంలో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పనుల నాణ్యతపై పర్యవేక్షణ చేస్తున్నాం.

క్షేత్రస్థాయిలో పరిశీలించాకే ఆమోదం


పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో పరిశీలించాకే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు ఆమోదం తెలిపాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం మెదక్ పట్టణం అవుసులపల్లిలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెదక్ పురపాలిక పరిధిలో వచ్చిన 3,782 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఈడీఎం సందీప్ ఉన్నారు.

దీర్ఘకాలిక పంటలతో అధిక ఆదాయం


అవగాహన కల్పిస్తున్న అదనపు సంచాలకులు రాజ్‌నారాయణ

రామాయంపేట, న్యూస్‌టుడే: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు దీర్ఘకాలిక పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చని రామాయంపేట అదనపు సంచాలకుడు రాజ్‌నారాయణ సూచించారు. మెదక్ జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్పాదక పంపిణీదారుల డిప్లొమా కోర్సులో భాగంగా రామాయంపేట శివారులోని ఖర్జూర తోటలో క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. విత్తన దశ నుంచి పంట కోత వరకు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో వస్తున్న మార్పులను, వినియోగిస్తున్న పురుగు మందులపై అవగాహన కల్పించారు.

ప్రత్యేక నిధులు కేటాయించండి


సమావేశంలో సీసీసీ అధికార ప్రతినిధి రామచందర్ గౌడ్

రామాయంపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాపై అధిష్ఠానం దృష్టిసారించి నామినేటెడ్ పదవులు కేటాయించడంతో పాటు అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని టీపీసీసీ అధికార ప్రతినిధి రామచంద్ర గౌడ్ కోరారు. మంగళవారం గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన మెదక్ జిల్లా సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. బీసీ కులగణన త్వరగా పూర్తిచేసి ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ-ఎలోకి మార్చడానికి కృషి చేస్తామని అధ్యక్షుడు హామీ ఇచ్చినట్లు రామచందర్ గౌడ్ తెలిపారు.

బోధనా రుసుములు విడుదల చేయండి



నర్సాపూర్‌లో విద్యార్థుల రాస్తారోకో

నర్సాపూర్: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, బోధనా రుసుమును ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నర్సాపూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో అభావిప, టీపీడీపీఎంఏల ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో చేపట్టారు. పేద విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఎల్లంకి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నలగండ్ల అశోక్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్షయ్‌గౌడ్, నాయకులు సాయిరాం, వరుణ్, భానుప్రసాద్, శ్రీశైలం, కరుణాకర్, మహేందర్ తదితరులున్నారు.

భాజపా బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

పాపన్నపేట, న్యూస్‌టుడే: భాజపా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పాపన్నపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ ప్రయోజనాల కోసం భాజపా కృషి చేస్తుందన్నారు. ప్రధాని మోదీ చేస్తున్న కృషిని, కేంద్ర పథకాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా సభ్యత్వ ఇన్‌ఛార్జి మురళీధర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రాములు, నాయకులు ఇమ్మాన్యుయేల్, నవీన్, సుధాకర్, కిష్టయ్య తదితరులున్నారు.

గాలికుంటు నివారణకు ఉచిత టీకాలు


రికార్డులు తనిఖీ చేస్తున్న వెంకటయ్య

కౌడిపల్లి, న్యూస్‌టుడే: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇప్పించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ ఇన్‌ఛార్జి ఏడీ డాక్టర్ వెంకటయ్య సూచించారు. మంగళవారం కౌడిపల్లిలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. జిల్లా అంతటా ఉచిత టీకాల కార్యక్రమం ప్రారంభమైందని.. వినియోగించుకోవాలని సూచించారు. పశువైద్యాధికారి రాజు, జేవీవో సుదర్శన్, ఎల్‌ఎస్‌ఏ వీరారెడ్డి, సహాయకులు చెన్నయ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు

న్యూస్‌టుడే, మెదక్ టౌన్: క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని మెదక్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌కుమార్ క్రీడాకారులకు సూచించారు. మెదక్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మెదక్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ప్రముఖ న్యాయవాది జనార్దన్ రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ప్రభు, ఆనందం, శ్యామ్‌రావు, దుర్గారెడ్డి, హన్మంతు, రవితేజ, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు 6 వరకు గడువు

తూప్రాన్, న్యూస్‌టుడే: పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటుకు నమోదు చేసుకోవాలని తూప్రాన్ ఆర్డీవో చంద్రరెడ్డి అన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలతో సమావేశం ఏర్పాటు చేశారు. అర్హులైన యువతీ యువకులు, ఉపాధ్యాయులు వచ్చే నెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ప్రతిపాదనలకే పరిమితం

హల్దీవాగుపై ముందుకు సాగని చెక్‌డ్యాంల నిర్మాణం


అసంపూర్తిగా చెక్‌డ్యాం పనులు

న్యూస్‌టుడే, నర్సాపూర్: వాన నీటిని ఒడిసి పట్టేందుకు గత ప్రభుత్వం హల్దీవాగుపై తొమ్మిది చెక్‌డ్యాంలు నిర్మించింది. దీంతో మంచి ఫలితాలు రావడంతో కొత్తవి నిర్మించేందుకు మరోమారు ప్రతిపాదనలు తయారు చేసి పంపింది. వీటికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోద ముద్రవేస్తే కొన్ని వేల ఎకరాలు అదనంగా సాగులోకి రానున్నాయి. మంజీరా, హల్దీ వాగుపై చెక్‌డ్యాంల నిర్మాణం ద్వారా వృథాగా పారే నీటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో చిలప్‌చెడ్ మండలం చండూరు, అజ్జమర్రి, ఫైజాబాద్, చిట్కుల్, కొల్చారం మండలం కోనాపూర్, పైతర, ఎనగండ్ల, మెదక్ మండలం సర్దన, కూచన్‌పల్లి, గ్రామాల్లో చెక్‌డ్యాంలు నిర్మించారు. వీటి పరిధిలో వంద ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. హల్దీవాగు కింద మాసాయిపేట మండలం బొమ్మారం, మాసాయిపేట, కొప్పులపల్లి, వెల్దుర్తి మండలంలో వెల్దుర్తి-1, వెల్దుర్తి-2, ఉప్పులింగాపూర్, కుకునూరు, దామరంచ-1, దామరంచ-2, శెట్టిపల్లికలాన్ గ్రామాల్లో ఉన్న వాటిని గోదావరి నీటితో నింపుతున్నారు.

హల్దీవాగుపై చెక్‌డ్యాంల నిర్మాణ ప్రతిపాదనలు

మండలం	గ్రామం	నిధులు(రూ.కోట్లలో)	సాగులోకి వచ్చే భూములు(ఎకరాల్లో)
వెల్దుర్తి	నెల్లూరు	5.79	800
వెల్దుర్తి	కొత్తపల్లి	5.29	750
వెల్దుర్తి	కుకునూరు	1.68	200
వెల్దుర్తి	మానెపల్లి	1.61	145
కొల్చారం	కొంగోడు	4.82	700
శివ్వంపేట	గుండ్లపల్లి	2.13	180

భూగర్భ జలాల వృద్ధి...

వాగులో పారే జలాన్ని సద్వినియోగం చేసుకునేందుకు చెక్‌డ్యాంల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. కిలోమీటర్ల పొడవునా వాగు పారుతున్నా పూర్తిస్థాయిలో దాని ప్రయోజనాలు పొందలేని పరిస్థితి ఉంది. చెక్‌డ్యాంల నిర్మాణంతో ఆ ప్రాంతాల్లో భూగర్భజలాలు వృద్ధి చెందనున్నాయి. కొన్ని వేల ఎకరాలు అదనంగా సాగులోకి రానున్నాయి. వాగు పరివాహక ప్రాంతాల్లోని అనేక గ్రామాల రైతులు లబ్ధిపొందనున్నారు.

అనువైన సమయం

గతంలో నిర్మించిన చెక్‌డ్యాంలు వేసవిలోనూ జలకళను సంతరించుకుంటున్నాయి. గాలిలో తేమ శాతంతో పంటల సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి. సాగు గణనీయంగా పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. ఆనకట్టల నిర్మాణంతో భూగర్భజలాలు వృద్ధి చెంది బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయి. మండుటెండల్లోనూ రెండు పంటలతో పరీవాహక ప్రాంతం పచ్చదనంతో కళకళలాడనుంది. ప్రస్తుతం పనులు కొనసాగించేందుకు అనువైన సమయం. ప్రభుత్వం అనుమతి ఇస్తే వెంటనే పనులు ప్రారంభించవచ్చని అన్నదాతలు పేర్కొంటున్నారు.

అనుమతులు రావాలి

చెక్‌డ్యాంల నిర్మాణానికి పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఆర్థిక శాఖ నుంచి బడ్జెట్ కేటాయిస్తూ క్లియరెన్స్ ఇస్తే పనులు ప్రారంభించడానికి వీలు కలుగుతుంది. ప్రతిపాదనలతో పాటుగా అంచనాలు రూపొందించి పంపించాం. ఈ అంశం ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది.

రాజేందర్‌రావు, డీఈ, నీటిపారుదల శాఖ

ఎల్లమ్మ దేవాలయంలో చోరీ


పొదల్లో పారేసిన హుండీ

టేక్మాల్: రేణుక ఎల్లమ్మ దేవాయ తాళం పగలగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన టేక్మాల్ మండల పరిధిలోని కాదులూర్ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గుర్తు తెలియని దుండగులు ఆలయం ఆవరణలోని హుండీని దొంగిలించారు. పక్కన ఉన్న ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి డబ్బులు తీసుకొని హుండీని అక్కడే పారేశారు. ఇప్పటికి మూడు సార్లు దేవాలయంలో చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేపు జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

తూప్రాన్, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక ప్రక్రియ మనోహరాబాద్‌లో గురువారం చేపడుతున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడిప్యాక నారాయణ గుప్త తెలిపారు. అర్హత కలిగిన క్రీడాకారులు ధ్రువపత్రాలతో ఈనెల 17వ తేదీన మనోహరాబాద్ క్రీడా ప్రాంగణంలో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 8106555942కు సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయపర్వం



చిన్నారిని ఆడిస్తున్న అమ్మమ్మ, వివరాలు రాస్తున్న అమ్మ



భార్య వెళ్లగా కుమారుడిని ఎత్తుకున్న తండ్రి

ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్‌కు కాబోయే టీచర్లు సిద్దిపేట కలెక్టరేట్‌కు మంగళవారం వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి వందలాది మంది తరలిరావడంతో కార్యాలయంలో సందడి నెలకొంది. మహిళ అభ్యర్థులు తమ వెంట తీసుకొచ్చిన శిశువులను కుటుంబ సభ్యులు ఎత్తుకోగా వారు కార్యాలయంలో వచ్చిన పని చేసుకున్నారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాక, న్యూస్‌టుడే: కూడవెల్లి రామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ఆలయ ఈవో పి.విశ్వనాథ శర్మ తెలిపారు. ఈ నెల 10న తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ కూడవెల్లి ఆలయానికి సంబంధించి ధర్మకర్తల మండలి నియామకానికి ప్రకటన ఉత్తర్వులు వెలువరించారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల్లోపు హైదరాబాద్‌లోని దేవదాయ ధర్మదాయ కమిషనర్‌కు గాని, సంగారెడ్డిలోని సహాయ కమిషనర్‌కు గాని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

అన్నదాత ఆవేదన

'ఫార్మాసిటీ'కి మూడు పంటలు పండించే భూములు సేకరించొద్దని వేడుకోలు



డప్పూర్‌లో ఇటీవల ఆందోళన చేస్తున్న రైతులు

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, న్యాల్‌కల్:

చుట్టూ ఎత్తైన గుట్టలు.. జలపరవళ్లతో వాగులు, చెక్ డ్యాంలు, చెరువులు.. పంటలు పండే భూములు.. జింకలు, నెమళ్లు, వలస పక్షుల సంచారం.. ఉమ్మడి జిల్లాకు తాగునీరందించే మంజీర నది పరీవాహకం ఇది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన ప్రాంతం ఇది. 2003 ఎకరాల భూసేకరణ చేపట్టాలని నిర్ణయించారు. దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర సరిహద్దులోని మూడు గ్రామాల ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నారాయణఖేడ్-బీదర్ 161(బి) నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతుల నుంచి పరిశ్రమల పేరిట స్థలాలు లాగేసుకుంటే ఊరుకోబోమని చెబుతున్నారు.

ఆందోళనలపై నివేదిస్తాం:

–రాజు, ఆర్డీవో, జహీరాబాద్

ఫార్మాసిటీ భూసేకరణ ప్రక్రియ ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు సాగుతుంది. భూములు కోల్పోతున్న రైతులు చేపడుతున్న ఆందోళనలపై ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది.

వాణిజ్య పంటల సాగు

కర్ణాటకలోని బీదర్ జిల్లా కేంద్రానికి సరిహద్దులుగా ఉండే ఈ మూడు గ్రామాల రైతులకు సాగు భూములు జీవనాధారం. చెరకు, అల్లం, పసుపు, పప్పుదినుసులు, నూనె గింజలు సహా కూరగాయలు, పత్తి ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. కూరగాయలను బీదర్, జహీరాబాద్, నారాయణఖేడ్, హైదరాబాద్‌లకు తరలిస్తారు. నారాయణఖేడ్-బీదర్ 161(బి) జాతీయ రహదారి పనులు ప్రారంభం కావడంతో మార్కెట్‌లో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతున్నాయి. భూమిని సేకరించే ప్రాంతాల్లోని నీటివనరుల ద్వారా మంజీర నదిలోకి నీరు చేరుతుందని.. కలుషితమయ్యే పరిస్థితి తలెత్తుతుందని పర్యావరణవేత్తలు, జీవవైవిధ్య సంరక్షకులు అంటున్నారు.



డప్పూర్, మల్గి శివారుల్లో ప్రతిపాదించిన పట్టా భూములు



సేకరించనున్న చెరువు ప్రాంతం

ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రణాళిక

• జహీరాబాద్ నిమ్జ్ (జాతీయ ఉత్పాదక పెట్టుబడుల మండలి)కు అనుసంధానం	• సేకరణలో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాలు
భూములు కోల్పోనున్న రైతులు 1,321	మొత్తం ఎకరాలు 2003
పట్టా స్థలాలు 1096.22 ఎకరాలు	అసైన్డ్ భూములు 907.17 ఎకరాలు

సేకరణకు గెజిట్ విడుదల ఆగస్టు 2024

భూమి సేకరించే గ్రామాల పరిధిలో ఉన్నాయివి

చెరువులు	2
వాగులు	5
చెక్ డ్యాంలు	15
బోరుబావులు	150
సాగునీటి బావులు	186

ఫార్మాసిటీ వద్దు.. పైసలు వద్దు



మా ఎకరా భూమి ఫార్మాసిటీకి పోతోంది. ప్రభుత్వం ఇచ్చే ఎంతటి పైసలైనా మాకొద్దు. మా గ్రామాలకు ఫార్మాసిటీ వద్దేవద్దు.

– శశికళ, మహిళ రైతు

పదిహేను ఎకరాలు కోల్పోతున్నాం



ఐదుగురం అన్నదమ్ములం. మా 15 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. మా అందరికీ 30 మంది సంతానం. గుంట భూమైనా మిగలడం లేదు. తర్వాత పరిస్థితి దయనీయంగా తయారవుతుంది. – మల్లప్ప, డప్పూర్

న్యాయ పోరాటం చేస్తాం



మూడు గ్రామాల సారవంతమైన భూములను సేకరిస్తామని ప్రకటించారు. వాటిని నమ్ముకున్న వారి నుంచి బలవంతంగా సేకరిస్తే న్యాయ పోరాటం చేస్తాం.

– రవికుమార్, మాజీ సర్పంచి, డప్పూర్




విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

జాతీయ యోగా పోటీలకు ఆకునూరు బాలికలు

చేర్యాల, న్యూస్‌టుడే: సంగారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.సాత్విక, 7వ తరగతి చదువుతున్న పి.అవంతిక జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయుడు ఐలయ్య, ఉపాధ్యాయ బృందం మంగళవారం అభినందించి, సన్మానించారు. నవంబరు 8 నుంచి అసోంలోని గౌహతిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.కవిత తెలిపారు. గ్రామానికి చెందిన సందెబోయిన వెంకటేశ్ రూ.8 వేల విలువైన యోగా దుస్తులు విద్యార్థినులకు అందజేశారు. అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ సైదా, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నింగి.. నేల.. ఒకటై..



ఆకాశంలో మేఘాలు పచ్చని పైర్లను, చెట్లను, గుట్టలను తాకే విధంగా ఉండి ఆహా అనేవిధంగా కనువిందు చేస్తోంది. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ రామప్ప గుడిపై నుంచి కనిపించిన ప్రకృతి రమణీయత చూసేవారిని కట్టిపడేసింది. – న్యూస్‌టుడే, చేగుంట, తూప్రాన్

మళ్లీ వరద... ఆలయం మూసివేత



ఆలయం ముందు ప్రవాహం



రాజగోపురంలో అమ్మవారికి పూజలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: సింగూరు నుంచి నీటిని విడుదల చేయడంతో ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద మంగళవారం ప్రవాహం పెరిగింది. తెల్లవారుజామున అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం చేపట్టి మూసివేశారు. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగించారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

చేగుంట, వెల్దుర్తి: పట్టపగలు ఇంట్లో చోరీ జరిగిందని మాసాయిపేటకు చెందిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మంగళవారం గ్రామానికి వెళ్లి విచారించారు. గ్రామానికి చెందిన పాపని శ్రీనివాస్ ఆదివారం వ్యవసాయ బోరు వద్దకు వెళ్లాడు. ఆయన భార్య బయటనుంచి గడియపెట్టి ఇంటి దాబాపైకి వెళ్లి పడుకున్నారు. సాయంత్రం శ్రీనివాస్ ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. లోపల చూడగా రూ.2 లక్షలు కనిపించలేదు. మంగళవారం పోలీసులు విచారించారు. రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ వివరణ కోరగా విచారిస్తున్నామన్నారు.

రైతును బురిడీ కొట్టించిన వ్యాపారి

హత్నూర, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యాపారి ఓ రైతును మోసం చేసిన ఘటన హత్నూరలో మంగళవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన రైతు బాలయ్య తెలిపిన ప్రకారం సోమవారం ఓ యువకుడు బియ్యం కొంటారా అని ఇంటికి వచ్చాడు. కర్నూలు సన్నరకం బియ్యం చూపించి, క్వింటాకు రూ.5,600 ధర చెప్పగా 25 కేజీల అయిదు బస్తాలు కొన్నా. ఊరి బయట డీసీఎం వాహనంలో ఉన్నాయని చెప్పి ద్విచక్రవాహనం మీద అయిదు బస్తాలు తీసుకొచ్చి ఇచ్చి, నగదు తీసుకుని వెళ్లిపోయాడు. మంగళవారం బియ్యం బస్తాలు తీసి చూడగా దొడ్డు రకం కనిపించాయి. దీంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. ఒక్కో బస్తాలో అయిదు కిలోల బియ్యం తరుగు వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ప్రకృతి మలచిన పర్యాటకం



గుట్టల మధ్య మహాసముద్రం చెరువు



'లైట్స్ ఆన్.. స్టార్ట్ కెమెరా.. యాక్షన్' అని చిత్రీకరణ సందడి హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్‌లోని మహాసముద్రం చెరువు పరిసరాల్లో ఇటీవల చోటుచేసుకుంటోంది. చుట్టూ ఎత్తైన హరిత కొండలు, పక్షుల కిలకిల రావాలు, వాటి మధ్య నీటిగలగలలు వెరసి ఆకట్టుకుంటోంది. సెలవు రోజుల్లో ఇక్కడి ప్రకృతి ప్రేమికులు ఇక్కడి వస్తున్నారు. లఘు చిత్రాలు, ప్రీ వెడ్డింగ్, రీల్స్ లాంటివి ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. చెరువు పక్కనే ఉన్న గుట్టను స్థావరంగా చేసుకుని సర్దార్ సర్వాయి పాపన్న ఈ ప్రాంతాన్ని గతంలో కొంత కాలం పరిపాలించారు. ఆనవాళ్లు గుట్టపై ఉన్నాయి. భైరవుడి విగ్రహం గుట్టపై ఉంది. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారు. అక్కడికి వెళ్లే రోడ్డు కొన్నిచోట్ల సరిగా లేదు. మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

ఏటీసీ.. నైపుణ్యాలకు అవకాశమిచ్చి..

ప్రభుత్వ ఐటీఐలకు మహర్దశ



న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: ఇది పోటీ ప్రపంచం. ప్రతిభ చూపితేనే అవకాశాలు సొంతమవుతాయి. నైపుణ్యాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థలను (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఏర్పాటుచేసినా ఆశించిన ఫలితాలు కనిపించని పరిస్థితి. నైపుణ్యాల లేమితో కోర్సు పూర్తిచేసినా చాలా మంది విద్యార్థులు అవకాశాలు దక్కించుకోలేకపోతున్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వారే ఎక్కువ. ఐటీఐలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల (ఏటీసీ) ఏర్పాటుకు సిద్ధమైంది. తాజాగా ఈ నెల 19 వరకు గడువుతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది.

ఇవీ కోర్సులు: • మ్యాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ • ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ • ఆర్టీసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ • బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైయర్ • అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్ • మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్

ఆవరణలోనే కేంద్రాలు

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలన్నింటిలోనూ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు ప్రభుత్వం ఇప్పటికే టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ఒక్కో ఐటీఐకి రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. వీటితో నూతన భవన సముదాయాలను నిర్మిస్తున్నారు. కళాశాల ఆవరణలో 10వేల చదరపు అడుగుల స్థలంలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఐదేళ్ల పాటు కోర్సు నిర్వహణ బాధ్యతలను సంస్థ చూసుకుంటుంది. కొత్త యంత్రాలు వస్తాయి. వివిధ కోర్సులతో ఐటీఐతో పాటు శిక్షణ పూర్తి చేసుకోగలుగుతారు.

విద్యార్థులకు మంచి అవకాశం:

– రాజేశ్వరరావు, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, సంగారెడ్డి



కోర్సుతో పాటు నైపుణ్యాల పెంపుతో మంచి అవకాశాలు ఉంటాయి. నైపుణ్య శిక్షణ పూర్తిచేసుకుంటే స్వయం ఉపాధిలోనూ రాణించేందుకు వీలుంటుంది. ఏటీసీలో ప్రవేశాలకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: వ్యక్తి అసభ్యకరంగా వ్యవహరించాడని మనస్తాపం చెందిన మహిళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నారాయణగౌడ్ తెలిపిన వివరాలు... పట్టణానికి చెందిన యాదమ్మ(40) కూలీ పనులు చేసుకుంటూ ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులను పోషిస్తోంది. ఏడేళ్ల క్రితం భర్త మృతి చెందగా, గుడిసెలో ఉంటోంది. పట్టణానికి చెందిన రాములు ఆదివారం యాదమ్మ ఇంటికి వచ్చి ఆమెతో అసభ్యకరంగా వ్యవహరించాడు. దీంతో పరువు పోయిందని మనస్తాపంతో మంగళవారం ఉదయం తన ఇంట్లో ఉరేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు నార్సింగ్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం



శివకుమార్

వికారాబాద్, న్యూస్‌టుడే: అప్పులు పెరిగిపోయి.. తీర్చే మార్గం కానరాక పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ ఎస్సై సత్యనారాయణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన లక్కాకుల శివకుమార్(31) స్థానికంగా ఎరువులు, పురుగు మందుల దుకాణం నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో తెలిసిన వారి నుంచి భారీగా అప్పులు చేశారు. తీర్చే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం కారులో వస్తూ వికారాబాద్ మండలం మైలార్‌దేవరంపల్లి సమీపంలో రోడ్డు పక్కన ఆగాడు. వెంట తెచ్చుకున్న పురుగు మందును కారులోనే తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దారిన వెళ్లే గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి శవాగారానికి తరలించారు. శివకుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ ఢీకొని దుర్మరణం



అనిల్ కుమార్

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన మంబోజిపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. గ్రామీణ ఠాణా ఎస్‌ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం... పాపన్నపేట మండలంలోని యూసుఫ్‌పేటకు చెందిన అనిల్ కుమార్(30) మెదక్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని గ్రామానికి చెందిన బాల్‌రాజ్‌తో కలిసి స్వగ్రామానికి వెళుతుండగా మంబోజిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందాడు. బాల్‌రాజ్ చికిత్స పొందుతున్నాడు. అనిల్‌కుమార్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గేదెను ద్విచక్రవాహనం ఢీకొని..



నాగులు

చేగుంట, న్యూస్‌టుడే: ఎదురుగా వచ్చిన గేదెను ద్విచక్రవాహనం ఢీకొనటంతో ఒకరు మృతిచెందిన ఘటన చేగుంట మండలం బోనాల వద్ద సోమవారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం పోసాన్‌పల్లికి చెందిన నాగులు(56) వ్యవసాయం చేస్తుంటాడు. శివ్వాయిపల్లిలో బంధువు అంత్యక్రియలకు తన అన్న కుమారుడు మల్లేశంతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి వస్తుండగా.. బోనాల శివారులో అడ్డుగా వచ్చిన గేదెను ఢీకొనటంతో వెనకాల కూర్చున్న నాగులు కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య యాదవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



గురువారెడ్డి

తొగుట, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై తొగుట మండలం గుడికందులకు చెందిన రైతు గోరిట గురువారెడ్డి(42) మృతిచెందాడు. గ్రామస్థులు, మిరుదొడ్డి ఎస్సై పరశురాములు కథనం మేరకు.. గురవారెడ్డికి నాలుగు ఎకరాల పొలం ఉంది. ఇటీవలే మొక్కజొన్న పంట కోశాడు. మళ్లీ ఆ భూమిని పొద్దుతిరుగుడు, మొక్కజొన్న సాగు కోసం సిద్ధం చేశాడు. నీటి తడులు ఇవ్వడానికి మంగళవారం బిందుసేద్యం పరికరాలు అమరుస్తున్నాడు. ఈ క్రమంలోనే భూమిలో చేతికి అందే ఎత్తులో ఉన్న ఎల్టి, 11 కేవీ విద్యుత్తు తీగలకు బిందుసేద్యం పరికరాలు తగిలి విద్యుదాఘాతానికి గురై గురువారెడ్డి అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలిసి భార్య రమాదేవి, కూతురు ఆకాంక్ష, కొడుకు లోకేష్ రెడ్డి బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై వెల్లడించారు.

ఆహార వృథాకు వేద్దాం కళ్లెం



• సిద్దిపేటలో వాణిజ్య సముదాయాలు 3600 వరకు కొనసాగుతున్నాయి. రెస్టారెంట్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వివిధ రకాల ఆహార తయారీ కేంద్రాల నుంచి నిత్యం 2.50 టన్నుల మేర ఆహార వ్యర్థాలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'బసిల్ ఫౌండేషన్ తెలంగాణ' సంస్థ సేకరిస్తోంది. బుస్సాపూర్‌లోని ప్లాంటుకు తరలించి గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు. రోజులో 1.80 క్యూబిక్ మీటర్ల గ్యాస్ వెలువడుతోంది.

• వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని సిద్దిపేట నిరాశ్రయుల కేంద్రం, సర్వజన ఆసుపత్రిలో రోగుల సహాయకులకు పంపిణీ చేస్తున్నారు. ఆలయాల్లో అన్నప్రసాదాల్లో మిగిలినవాటినీ కేంద్రాలకు తరలిస్తున్నారు. అన్నార్థుల ఆకలిని తీర్చడంతో పాటు వృథాకు అడ్డుకట్ట వేసినట్లవుతోంది.

• సిద్దిపేటలోని ఓ రెస్టారెంట్‌లో నిత్యం 50 కిలోలకు పైగా బిర్యానీ, ఇతరత్రా ఆహార ఉత్పత్తులు తయారీ చేసి విక్రయిస్తున్నారు. అందులో దాదాపు 8 కిలోల వరకు వృథాగా మారుతోంది. పలువురు వినియోగదారులు పూర్తిస్థాయిలో తినక అలానే వదిలిపెడుతున్నారు. కొందరు మిగిలిన ఆహారాన్ని ఇంటికి పార్సిల్ తీసుకెళ్తున్నారు. మరికొందరు యాచకులకు అందిస్తున్నారు.

న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి మున్సిపాలిటీ, గజ్వేల్:

అన్నం పరబ్రహ్మ స్వరూపం. పేదరికంలో మగ్గే ఎంతో మంది ఒక్కపూట భోజనానికైనా అలమటిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆహార వృథాను అరికట్టాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపైనా ఉంది. ప్రతి మెతుకు.. ఇంకొకరి బతుకు కోరుతుందనే కోణంలో యోచించాలని సామాజికవేత్తలు చెబుతున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఆ దిశగా చైతన్యం రావాల్సి ఉంది. **నేడు ప్రపంచ ఆహార వృథా నివారణ దినోత్సవం సందర్భంగా** 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

జీవనశైలితో మార్పు

జీవనశైలి మారిన ప్రస్తుత తరుణంలో బయట లభించే ఆహారపదార్థాలను ఎక్కువగా ఆరగిస్తున్నారు. వారాంతాలు, ప్రత్యేక రోజుల్లో ఆహార కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. ఎక్కువ శాతం మంది ఆహారాన్ని వృథా చేస్తున్నారు. కొందరు నిర్వాహకులు మాత్రమే సేవాభావాన్ని చాటుతున్నారు. సరైన అవగాహన లేక కొన్ని కుటుంబాల సభ్యులు ఇంటి వద్ద ఆహారాన్ని వృథాగా పారేస్తున్నారు. పల్లెలతో పోల్చితే పట్టణాల్లో ఎక్కువ శాతం ఈ ధోరణి కనిపిస్తోంది. ఆహారం వృథా చేయకుండా దాని విలువను గుర్తించి సద్వినియోగం చేసేందుకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



గ్యాస్ ఉత్పత్తి చేసే సిద్దిపేట బుస్సాపూర్ ప్లాంటు

చైతన్యం అందరిలో రావాలి

– జోజి, సామాజిక కార్యకర్త, మాజీ సైనికుడు, సిద్దిపేట



వేడుకలను ప్రణాళికాయుతంగా నిర్వహించాలి. మెనూలో జాగ్రత్తలు తీసుకోవాలి. అనేక రకాలు వడ్డించడంతో సగం వృథాగా మారుతున్నాయి. పారబోతకు ఆస్కారం లేకుండా అవగాహన కల్పించాలి. ఇతర దేశాల్లో హోటళ్లలో అవగాహన కల్పించే సిబ్బంది ఉంటారు. అందరిలో చైతన్యం వస్తే వృథా తగ్గించొచ్చు.

ఆకలి తీర్చడమే.. శరణమయ్యప్పా..



రోడ్డు పక్కన నివసించే వారికి ఆహార పొట్లాలు ఇస్తున్న భక్తులు

రోడ్డు పక్కన రాత్రి సమయంలో ఉండే నిరాశ్రయులకు అయ్యప్ప ఆపద్బాంధవ సేవా సమితి తన వంతు చేయూత అందిస్తోంది. అయ్యప్ప దీక్ష తీసుకున్నా.. లేకున్నా.. సంగారెడ్డి జనప్రియ హోటల్ యజమాని రాజు గురుస్వామి సహకారంతో భోజన ప్యాకెట్లను అందిస్తున్నారు. హోటల్‌లో అమ్ముడు పోగా మిగిలిన తాజా ఆహార పదార్థాలను సభ్యులు ప్యాక్ చేసి కొత్త, పాత బస్టాండ్లు, జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రాంతాల్లో రోడ్డు పక్కన నివసిస్తున్న వారికి అందిస్తున్నారు. ఆకలి తీర్చడాన్ని ఆధ్యాత్మిక సేవగా భావిస్తున్నామన్నారు.

ఇలా చేద్దాం

• ఆహారాన్ని పారేయకుండా ఇతరులకు ఇచ్చే అలవాటు చేసుకోవాలి.
• స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు సామాజిక బాధ్యత నిర్వర్తించాలి.
• పాఠశాలలు, వసతిగృహాల్లో వృథా అవుతోంది. నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి.
• వేడుకల్లో భోజనాల అంచనా ముందుచూపుతో ఉండాలి.
• పోషకాల రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

బైకు సీటు కింద పాము.. తప్పిన ముప్పు



దోమ, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని ఓ వ్యక్తి మెకానిక్ దగ్గరకు తీసుకెళ్లాడు. ఆ బండి సీటులోంచి నాగుపాము బయటికి రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. దోమ మండలం బుద్లాపూర్‌లోని ఈ ఘటన చోటు చేసుకుంది. నరేష్‌కు స్థానికంగా బైక్ మెకానిక్ షాపు ఉంది. మంగళవారం ఓ వ్యక్తి తన బైక్ నడవడం లేదని ఆయన దగ్గరకు తీసుకువెళ్లాడు. బైక్‌సీటు తొలగించే క్రమంలో నరేష్‌కు సీటుకింద నాగుపాము కన్పించింది. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి వెనక్కి తప్పుకొన్నాడు. సరిగ్గా అదే సమయంలో కుల్కచర్ల మండలానికి చెందిన శ్రీనివాస్ వెళ్తున్నాడు. అతడిని పాములు పట్టే అలవాటుంది. పది నిమిషాలు శ్రమించి దాన్ని బయటకు తీశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00	డ్రెస్డ్	215–00
రిటైల్	148–00	స్కిన్‌లెస్	244–00

పార్టీలకతీతంగా పేదలకు సాయం


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: పార్టీలకతీతంగా పేదలందరికీ సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఖేడ్‌లోని ఆయన నివాసంలో పేట మండలం బూర్గుపల్లికి చెందిన అరుణ్‌కుమార్‌కు మంజూరైన రూ.30వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కుటుంబీకులకు అందించారు. కాంగ్రెస్ నాయకులు పెరమాండ్ల గౌడ్, సత్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజు పాల్గొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం


టేక్మాల్: బొడ్మట్‌పల్లిలో పాల్గొన్న గ్రామస్థులు

టేక్మాల్, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మండల పరిధిలోని బొడ్మట్‌పల్లిలో మంగళవారం నిర్వహించారు. చౌరస్తాలోని కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, రవిశంకర్, శ్రీనివాస్, భరత్ భూషణ్, షాబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

చిన్నశంకరంపేట: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ అన్నారు. మంగళవారం కలాం జయంతి సందర్భంగా కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

స్వచ్ఛ నీటి సరఫరాపై శిక్షణ


రైతు వేదికలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో స్వచ్ఛ నీరు అందించేందుకు మెలకువలు నేర్పిస్తున్నామన్నారు. శిక్షకులు శ్రీకాంత్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇన్‌ఛార్జి ఏఈ అన్వేష్ రెడ్డి, ఎంపీవో కలీముల్లా, మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

పాపన్నపేట: ప్రజలకు అంతరాయం లేకుండా మంచినీరు సరఫరా చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్పీవో సురేశ్‌బాబు తెలిపారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయంలో మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా కృషి చేయాలన్నారు. మిషన్ భగీరథ డీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో విష్ణువర్ధన్, ఏఈ సురేశ్, ఎంపీవో పరమేశ్వర్ ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వండి

రేగోడ్, న్యూస్‌టుడే: మారుమూల ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు అధికంగా ఉన్నాయని, వాటి భర్తీకి కృషి చేయాలని మంగళవారం మెదక్‌లో డీఈవో రాధాకిషన్‌కు వినతిపత్రం అందించినట్లు సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కిషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం కొత్త ఉపాధ్యాయుల నియామకాన్ని చేపట్టడంతో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని కోరానన్నారు.

నీటి బావులతో భూగర్భ జలాలు మెరుగు


పనులు పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: నీటి బావులతో చాలా ఉపయోగాలున్నాయని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ఫారం పాండ్‌ను పరిశీలించారు. రైతులు వాటిని ఉపయోగించుకొని పంటలు పండించుకోవచ్చన్నారు. వర్షపు నీరు బావుల్లోకి చేరి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అంతకుముందు గ్రామంలోని వీధుల్లో తిరిగి పచ్చదనం- పరిశుభ్రతను పరిశీలించారు. తాగునీటి సరఫరాపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యదర్శి మల్లేషం, టీఏ మురళి, సంతోష్, వెంకటేశ్ ఉన్నారు.

కుల బహిష్కరణ సరికాదు

నర్సాపూర్, న్యూస్‌టుడే: గ్రామాల్లో రోజురోజుకూ మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయని, ఇందుకు కుల బహిష్కరణ తాజా ఉదాహరణేనని సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు అన్నారు. మండలంలోని తుజాల్‌పూర్‌లో రెండు కుటుంబాలను కొందరు కుల బహిష్కరణ చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆయిల్‌పాం వైపు అడుగులు

జిల్లాలో పెరుగుతున్న సాగు

న్యూస్‌టుడే- వెల్దుర్తి, శివ్వంపేట


హకీంపేట పరిధిలో సాగైన మొక్కలు

దేశంలో వంట నూనెలకు సంబంధించిన పంటల సాగు తగ్గిపోవడంతో కొరత ఏర్పడి విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులను అధిగమించడానికి రాష్ట్రంలో ఆయిల్ పాం సాగు పెంచాలని ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. పండించిన పాం గెలలను కొంటామనే ఒప్పందంతో అన్నదాతలకు రాయితీలిచ్చి సాగు పెరిగేలా కృషి చేస్తున్నారు. జిల్లాలో సుమారు 5 వేల ఎకరాల్లో ఆయిల్ పాం సాగు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే సుమారు 600 ఎకరాలకుపైగా సాగవుతోంది. ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతోపాటు గెలలు కొనే ప్రైవేటు కంపెనీ శాస్త్రవేత్తలు, సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగుతో పాటు పంట సస్యరక్షణ కోసం పలు సూచనలిస్తున్నారు. తరచూ పంట పొలాలను పరిశీలిస్తున్నారు.

వెల్దుర్తి ఉమ్మడి మండలంలో అత్యధికంగా..

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 600 ఎకరాల వరకు ఆయిల్ పాం సాగవుతోంది. వెల్దుర్తి ఉమ్మడి మండలంలోనే అత్యధికంగా 150 ఎకరాల్లో పంట వేశారు. మాసాయిపేట, హకీంపేట, వెల్దుర్తి మండలంలోని ఉప్పులింగాపూర్, కుకునూర్, వెల్దుర్తి, హస్తాల్‌పూర్, దామరంచ, యశ్వంతరావుపేటలో సాగు చేశారు. కొంతమంది అన్నదాతలు అంతర పంటలూ సాగు చేసి ఆదాయం పొందుతున్నారు. ఆయిల్ పాం తోటల చుట్టూ చల్లని వాతావరణం కల్పించడానికి ఇతర ఎత్తయిన మొక్కలు నాటాలని క్షేత్ర అధికారి రాకేశ్ సూచిస్తున్నారు.

శివ్వంపేట మండలంలో..

మండలంలో ఇప్పటి వరకు 250 ఎకరాల్లో ఆయిల్ పాం మొక్కలు నాటేందుకు లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటి వరకు 30 ఎకరాల్లో సాగు చేశారు. మండలంలోని పెద్దగొట్టిముక్కల, చిన్నగొట్టిముక్కలలో ఏడుగురు రైతులు 30 ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా చాలా మంది ముందుకొస్తున్నారు. పెద్దగొట్టిముక్లలో అంతర పంటగా పత్తి సాగు చేసి రైతులు ఆదాయం పొందుతున్నారు. పాం సాగుకు అన్నదాతలు ముందుకు రావాలని, ప్రభుత్వపరంగా అన్ని రకాల సహకారం, రాయితీలు అందించడానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

ఓటుహక్కు వినియోగించుకోండి


ఓటరు నమోదు పత్రాలతో ఉపాధ్యాయులు

నర్సాపూర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను నర్సాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హెచ్ఎం విఠల్‌కు మంగళవారం సమర్పించారు. దరఖాస్తులను సమర్పించే ముందు వాటిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ మాట్లాడుతూ.. అర్హులైన ఉపాధ్యాయులంతా ఓటుహక్కును తప్పక నమోదు చేసుకోవాలని సూచించారు. పీఆర్టీయూ టీఎస్ బలపర్చిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, అసోసియేట్ అధ్యక్షుడు ఇంతియాజ్, జ్యోతి ఉన్నారు.

హవేలిఘనపూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి కోరారు. మంగళవారం హవేలిఘనపూర్, రాజ్‌పేట, బూరుగుపల్లిలో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై లింగం తెలిపిన వివరాలు.. మూసాపేటకు చెందిన అన్నం దశరథ(40) మేకల కాపరి. ఈనెల 13న ఉదయం మద్యం తాగి ఇంటికెళ్లడంతో భార్యతో గొడవ జరిగింది. ఇంట్లో నుంచి నర్సాపూర్ వచ్చి పురుగుమందు తాగిన దశరథ భార్యకు ఫోన్ చేశాడు. ఆమె వెంటనే వచ్చి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కణ్నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. దశరథకు పదేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు, కుమారుడున్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదైంది. విచారణ చేస్తున్నారు.

దారి పక్కనే వ్యర్థాల కుప్ప



మండల కేంద్రంలోని నర్సాపూర్- తూప్రాన్ జాతీయ రహదారి పక్కన కల్వర్టు వద్ద వ్యర్థాలు పారబోశారు. దీంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తోంది. గుంతలో వర్షపు నీరు అధ్వానంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, శివ్వంపేట



జాతీయ రహదారి.. అధ్వానంగా మారి

జాతీయ రహదారిపై పెద్ద గుంతలు పడినా సంబంధిత అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చేగుంట నుంచి గజ్వేల్‌కు వెళ్లే మార్గంలో 44వ జాతీయ రహదారి వంతెన వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతల్లో నీరు నిలిచి లోతు తెలియడం లేదు. రాత్రివేళ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. - న్యూస్‌టుడే, చేగుంట

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి

తూప్రాన్, న్యూస్‌టుడే: డివిజన్‌లో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఈ గరట్‌మంతరాజు తెలిపారు. రైతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను విద్యుత్తు సిబ్బంది సన్మానించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కౌడిపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధి సదాశివపల్లి పంచాయతీ పాంపల్లికి చెందిన చాకలి రామాంజనేయులు ఇటీవల మృతిచెందడంతో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం సమకూర్చారు. మంగళవారం భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు హరీశ్, ఆంజనేయులు, సుధాకర్ బాధితుల ఇంటికెళ్లి అందించారు.

గాలికుంటు టీకా శిబిరాలు ప్రారంభం

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం గాలికుంటు నివారణ టీకాల శిబిరాలు ప్రారంభమయ్యాయి. మూసాపేటలోని 146 తెల్ల, నల్లజాతి పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ మహిందర్ రెడ్డి, గోపాలమిత్ర మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సెలవులు ముగిశాయ్.. బడికి రండి


రామతీర్థంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

పాపన్నపేట, న్యూస్‌టుడే: దసరా సెలవుల అనంతరం చాలామంది పాఠశాలకు రాకపోవడంతో ఉపాధ్యాయులే విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆహ్వానించారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో సుమారు 500 మంది చదువుకుంటున్నారు. దసరా సెలవుల అనంతరం మంగళవారం బడులు పునః ప్రారంభమైనా 100లోపు మాత్రమే వచ్చారు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బడికి రావాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. నర్సింగరావుపల్లి తండా, మొదల్లకుంట తండా, రామతీర్థం, మధిరకొత్తపల్లిలో గురువులు పర్యటించారు. ఉపాధ్యాయులు నర్సింలు, కృష్ణకాంత్, మోహన్‌రావు, సంగప్ప ఉన్నారు.

పిట్టలవాడలోనే పాఠశాల ఏర్పాటు చేయాలి..

శివ్వంపేట, న్యూస్‌టుడే: సికింద్లాపూర్ పంచాయతీ పరిధిలోని పిట్టలవాడలోనే పాఠశాల ఏర్పాటు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. విద్యార్థులను బడికి పంపాలని మంగళవారం హెచ్ఎం రామచంద్రారెడ్డి తల్లిదండ్రులతో మాట్లాడారు. పొలాలు, అడవి గుండా బిల్లీపూర్‌కు రావడం ఇబ్బందిగా ఉందని వారు తెలిపారు. ఎక్కువ మంది పిల్లలున్న పిట్టలవాడలోనే బడి ఉండాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

వైద్యులపై దాడులు అరికట్టాలని దీక్ష

గజ్వేల్, న్యూస్‌టుడే: వైద్యులపై దాడులు అరికట్టడంతో పాటు కలకత్తాలో మహిళా వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన దోషులను వెంటనే శిక్షించాలని వైద్యులు డిమాండు చేశారు. ఐఎంఏ పిలుపు మేరకు గజ్వేల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రి ముందు ఒకరోజు దీక్ష చేపట్టారు. హైదరాబాద్ కిమ్స్, సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు నరేశ్‌బాబు, నాగమునయ్య తదితరులున్నారు.

కంచె ఏర్పాటు చేయరూ..



మండల పరిధి కసాన్‌పల్లిలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. అసంపూర్తి పంచాయతీ భవనం పక్కనే ఉండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడే పిల్లలు ఆడుకుంటుంటారు. నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, చేగుంట

బీవీ రాజుకు నివాళి


సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న ఆదిత్య విస్సం

నర్సాపూర్, న్యూస్‌టుడే: విష్ణు విద్యాసంస్థల వ్యవస్థాపకుడు బీవీ రాజు జయంతిని నర్సాపూర్‌లోని బీవీ ఆర్ఐటీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిబ్బందికి కార్యదర్శి ఆదిత్య విస్సం దుస్తులు అందించారు. కళాశాల డైరెక్టర్ డా.లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపల్ సంజయ్‌దూబే తదితరులు పట్టణంలోని వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పలువురు పాల్గొన్నారు.

పాఠశాలలో వస్తువులు ధ్వంసం


మిషన్ భగీరథ పైపులైన్ ఇలా..

మనోహరాబాద్, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో మండల పరిధి ముప్పిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తాళాలు వేశారు. పండగ అనంతరం బడికి వచ్చిన ఉపాధ్యాయులు ఆవరణ చూసి విస్తుపోయారు. మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసం చేయడమే కాకుండా తరగతి గదుల తాళాలు విరగ్గొట్టారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి తెలిపారు.

డీఈగా చాంద్ షరీఫ్ బాషా



మెదక్ టౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు డివిజనల్ ఇంజినీర్‌గా చాంద్ షరీఫ్ బాషా మంగళవారం ఎస్ఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన మహబూబ్‌నగర్ జిల్లా నుంచి సాధారణ బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన కృష్ణారావు హైదరాబాదులోని కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు కార్మిక సంఘం ఆధ్వర్యంలో చాంద్ షరీఫ్ బాషా, బదిలీపై వెళ్లిన కృష్ణారావును శాలువాలతో సన్మానించారు. సంఘం డివిజన్ కార్యదర్శి అశోక్, నాయకులు నాగరాజు, రాజేశ్వరరావు, ప్రవీణ్, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై పోచయ్య

రేగోడ్, న్యూస్‌టుడే: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించకుంటే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై పోచయ్య అన్నారు. రేగోడ్‌లో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. సామర్థ్యానికి మించి వాహనాలపై వస్తువులు, సరకులు రవాణా చేయరాదన్నారు. వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు సరిగా లేని పలువురు వాహనదారులకు జరిమానాలు విధించినట్లు తెలిపారు.

దుర్గామాత నిమజ్జనం



పెద్ద శంకరంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి దుర్గామాత నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. శ్రీరామ్ సేన ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

వెలగని 'దీపం'.. చీకట్లో ప్రయాణం



మెదక్ పట్టణ శివారు పసుపులేరుపై నిర్మించిన వంతెనపై విద్యుద్దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళ వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండా నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మెదక్ అర్బన్

బస్సులు కరవు.. తిప్పలు తీరవు

పలు మార్గాల్లో రద్దు చేసిన ఆర్టీసీ అధికారులు

న్యూస్‌టుడే, నర్సాపూర్


బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు

ప్రధాన మార్గాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు బాగా లేవని, కొరతను సాకుగా చూపి ఆయా మార్గాల్లోని సర్వీసులను రద్దు చేస్తోంది. దీంతో పల్లెల నుంచి నియోజకవర్గ, మండల కేంద్రాలకు వచ్చే వారికి ఆటోలు, ఇతర వాహనాలే దిక్కవుతున్నాయి. నర్సాపూర్‌లో ఆర్టీసీ డిపో ఏర్పాటైంది. దీంతో ఇతర డిపోల నుంచి నడిచే బస్సులు రద్దు చేశారు. నర్సాపూర్ డిపో బస్సులే ఆధారమయ్యాయి. సరిపడా బస్సుల్లేక ఆయా మార్గాల్లో ఇబ్బందులు తప్పడం లేదు.

చాలా రూట్లలో తక్కువే..

నర్సాపూర్ డిపోకు కొత్తగా 15 బస్సులు వస్తాయన్నారు. ఇంతవరకు మూడు మాత్రమే పంపారు. గతంలో నర్సాపూర్ నుంచి శ్రీశైలానికి రెండు బస్సులు నడిపేవారు. వాటిని రద్దు చేసి మెదక్ నుంచి నడుపుతున్నారు. యాదగిరిగుట్ట మార్గంలో నడిచేవాటినీ రద్దు చేశారు. విజయవాడ, అమలాపురం, కాకినాడకూ తిరగడం లేదు. నర్సాపూర్ వయా కొండాపూర్ నత్నాయిపల్లి, పలుగు పోచమ్మ మీదుగా పటాన్‌చెరు వరకు మూడు బస్సులు నడిచేవి. రోడ్డు బాగా లేదని నడపడం మానేశారు. ఆవంచ మార్గంలో పటాన్‌చెరుకు ఒక బస్సు మాత్రమే వేశారు. నర్సాపూర్ వయా దౌల్తాబాద్ మార్గంలో పటాన్‌చెరు వరకు బస్సులు నడపాలని మొరపెట్టుకున్నా ఫలితం కనిపించడం లేదు. నర్సాపూర్ నుంచి సంగారెడ్డి మార్గంలో సాయంత్రం 6.30 దాటితే బస్సుల్లేవు. గతంలో అక్కణ్నుంచి రాత్రి 9 గంటల వరకు ఉండేవి. ఈ మార్గంలో ప్రయాణించే కార్మికులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో ఉదయం పూట సరిపడా బస్సుల్లేవు. జోగిపేట, పటాన్‌చెరు, సంగారెడ్డి, బాలానగర్ మార్గాల్లో బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నర్సాపూర్ డిపోలో 26 సర్వీసులే..

కొత్తగా ఏర్పాటైన డిపోలో 26 బస్సులే ఉన్నాయి. ఇందులో 23 మాత్రమే తిరుగుతున్నాయి. వాటిలో రెండు డీలక్స్‌లు, మిగతావన్నీ పల్లె వెలుగులే. డ్రైవర్ల కొరత కారణంగా కొన్ని డిపోకే పరిమితమవుతున్నాయి. ఆయా మార్గాల్లో సరిపోను సర్వీసులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం...

కొత్తగా వచ్చే బస్సులను నర్సాపూర్- జోగిపేట మార్గంలో 2, నర్సాపూర్- దౌల్తాబాద్, హత్నూర, పటాన్‌చెరు మార్గంలో 3, నర్సాపూర్- బాలానగర్ మార్గంలో 2, నర్సాపూర్- నత్నాయిపల్లి, పలుగుపోచమ్మ ఆలయం వరకూ ఒక బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులు గతంలో ప్రతిపాదించారు. సరిపడా బస్సులు లేనందున ఆదాయాన్నిచ్చే ఈ మార్గాల్లో కొత్తవి తిప్పాలని నిర్ణయించారు. కొత్తగా బస్సులు కేటాయించడంతోపాటు చోదకులను నియమించాలని ప్రయాణికులు కోరుతున్నారు. సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తూనే ఉన్నామని డిపో బాధ్యుడు లక్ష్మణ్ తెలిపారు.

హెచ్‌బీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దశంకరంపేట: పేటలోని తిర్మలాపురం ఆదర్శ పాఠశాలలో హవర్లీ బేస్డ్ టీచర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు 16న దరఖాస్తులు అందించాలని ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు. అర్థశాస్త్రం, గణితం, రసాయశాస్త్రం సబ్జెక్టుల్లో పీజీటీ పోస్టుకు అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్, బీఈడీ పూర్తి చేసిన వారు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. ఎంపికైన వారికి పీరియడ్‌కు రూ.182 చొప్పున ఇస్తారన్నారు. నెలకు వంద పీరియడ్లకు మించకుండా గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బిల్లులు విడుదల చేయాలని ఆందోళన


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తూప్రాన్, న్యూస్‌టుడే: ఫీజు రీయంబర్స్‌మెంట్ బిల్లులు ఇవ్వాలని తూప్రాన్‌లోని ప్రైవేటు డిగ్రీ కళాశాల విద్యార్థులు నిరసన తెలిపారు. ఉద్యోగుల జీతాలు, భవనాల అద్దెలు, రోజువారి ఖర్చులు, కరెంట్ బిల్లులు ఎలా భరించాలని నిర్వాహకులు వాపోయారు. బిల్లులు చెల్లించాలని 9 నెలలుగా ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేదన్నారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రామాయంపేట: బకాయి ఉపకార వేతనాలు ఇవ్వాలని డిగ్రీ విద్యార్థులు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ర్యాలీ తీశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

పెద్దశంకరంపేట: ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దినకర్, ఉపాధ్యక్షుడు పాపయ్య అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఏఐఎస్ఎఫ్ బాధ్యులు దత్తు, సాయికుమార్, దుర్గేశ్, దుర్గయ్య పాల్గొన్నారు.